క్లుప్తంగా

పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా రామకోటేశ్వరావు



కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండల పరిధిలోని కొక్కిలిగడ్డ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కొల్లిపర రామకోటేశ్వరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే మెరకనపల్లి, మేళ్లమర్తిలంక, ఉత్తరచిరువోలులంక పంచాయతీలకు కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన కొక్కిలిగడ్డ పంచాయతీకు ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాం బాబు, గ్రామ సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రాఘవేంద్రునికి ఆవు పాలతో అభిషేకం



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో ఉపాలయంగా ఉన్న రాఘవేంద్ర స్వామి దేవస్థానంలో స్వామి వారి జన్మదినం సందర్భంగా ఆదివారం 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారులు వేద మంత్రోచ్ఛరణలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో అలంకరించారు.

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్



అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని వసుమట్ల ఎస్సీ కాలనీ శ్మశాన వాటికను ఆదివారం బాగు చేయించారు. శ్మశానవాటికకు వెళ్లే రహదారి మూసుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబుకు స్థానికులు తెలియజేయగా.. ఆయన ఆదేశాల మేరకు సర్పంచ్ గౌరుముచ్చు ఉమా నేతృత్వంలో పనులు చేపట్టారు. ప్రొక్లెయిన్ ద్వారా శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించారు. పనులను పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్ పర్యవేక్షించారు.


నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 14 అంశాలపై చర్చించి ఆమోదిస్తారన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె సూచించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

కోనేరుసెంటర్: యువకుడి అదృశ్యంపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన బొల్లా రోహిణి రఘునాథ్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ఓ షాపింగ్ మాల్‌లో ఉద్యోగానికి చేరాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. ప్రయోజనం లేకపోయింది. దీంతో తల్లి బొల్లా ధనలక్ష్మి తన కుమారుడు కనిపించటంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సృజనకు పదును పెట్టేందుకు దోహదం



రామచంద్రపురం(అవనిగడ్డ): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు టెక్నోఫెస్ట్ వంటి కార్యక్రమాలు దోహద పడతాయని హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ జాషువా పాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రామచంద్రపురం దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం టెక్నోఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులుపలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. రైతులు, సామాన్యులకు ఉపయోగపడే విధంగా ఆటోమేటిక్ నీటి పిచికారీ యంత్రం, మెట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరం, భూకంపాల హెచ్చరికల అలారం వంటి పరికరాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో మరమ్మతులు
- నియోజకవర్గంలో 139 పనులకు రూ.5.52 కోట్లు మంజూరు
- 42 రోడ్లు పూర్తి, మిగిలిన రహదారుల పనులు వేగవంతం



బదేవారిపాలెంలో నిర్మించిన సిమెంట్ రహదారి

అవనిగడ్డ: కోడూరు మండలం పిట్టల్లంకలో ఎస్సీ కాలనీకి లింకు రోడ్డు లేకపోవడంతో కాలువ అవతలి వారు ఈ కాలనీకి వెళ్లాలంటే ఒక కిలో మీటర్ తిరిగి రావాల్సిన పరిస్థితి. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా కేటాయించిన నిధులతో ఇక్కడ లింకు రోడ్డు నిర్మించడంతో తిరిగిరావాల్సిన సమస్య తీరింది. ఇలా నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బందిగా మారిన రహదారులకు గడపగడపకు నిధులతో మోక్షం లభించనుంది. పలుచోట్ల సరైన రహదారి లేక ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరట కలుగుతోంది.

139 పనులకు రూ.5.52 కోట్లు:

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 139 సీసీ రహదారి పనులకు రూ.5.52 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. అవనిగడ్డ మండలంలో 24 పనులకు రూ.89.65 లక్షలు, కోడూరులో 12 పనులకు రూ.40లక్షలు, నాగాయలంకలో 34 పనులకు రూ.150లక్షలు, మోపిదేవిలో 14 పనులకు రూ.55 లక్షలు, చల్లపల్లిలో 18 పనులకు రూ.80లక్షలు, ఘంటసాల మండలంలో 37 పనులకు 138.30 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న రహదారి సమస్యలు గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో పరిష్కారం కావడంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తీవ్ర ఇబ్బందులున్న రహదారులకు ప్రాధాన్యం..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల్లో ప్రజలు బాగా ఇబ్బందులు పడే రహదారులకు ఈ నిధులు కేటాయించారు.

42 రహదారులు పూర్తి..

ఈ నిధులతో తొలి విడతగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రహదారులను నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 42 చోట్ల చేపట్టిన సీసీ రహదారి పనులు పూర్తికాగా, మరో ఆరు చోట్ల పనులు జరుగుతున్నాయి. మిగిలిన రహదారులకు అంచనాలు పూర్తి చేసి త్వరలోనే పనులు చేపడతామని పంచాయితీరాజ్ శాఖ డీఈ బండారు వెంకటేశ్వరరావు చెప్పారు. దీంతో సరైన రహదారిలేక ఎన్నో ఏళ్ల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మంచిరోజులు వచ్చాయి.

పెద్ద బాధ తప్పింది..



వాటర్‌ట్యాంకు రోడ్డు నుంచి ఎస్సీ కాలనీకి వెళ్ళేందుకు పంటకాలువపై లింకు రహదారి లేకపోవడంతో చుట్టూ కిలో మీటర్ దూరం తిరిగి వెళ్ళాల్సి వచ్చేది. లింక్ రోడ్డు వేయడంతో తిరిగెళ్ళే సమస్య తప్పింది.

– కైలా శ్రీనివాసరావు, స్థానిక నివాసి, పిట్టల్లంక

ఇబ్బందులు తొలిగాయి..



మా రహదారి చాలా దారుణంగా ఉండేది. చినుకు పడిందంటే బురదలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. బైక్‌లు ప్రధాన రహదారి పక్కన పెట్టి ఇళ్లకు వెళ్లాల్సి వచ్చేది. బురద రోడ్డుపై వెళ్లేదుకు వృద్ధులు, పిల్లలు చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. గడప గడపకు నిధులతో రోడ్డు వేయడంతో మా ఇబ్బందులు తీరిపోయాయి.

– చోడె రమణ, స్థానిక నివాసి, పిట్టల్లంక

కలసికట్టుగా కృషి చేద్దాం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల, గ్రామ, బూత్ స్థాయి కన్వీనర్లు ప్రతి నాయకుడిని కలుపుకుంటూ సమిష్టిగా పని చేసి, వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో చల్లపల్లి మండల గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు గ్రామ సచివాలయ కన్వీనర్ల రాష్ట్ర కోఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మార్చి 18 నుంచి కార్యక్రమం..

రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 18 నుంచి ప్రత్యక్షంగా ఐదు కోట్ల మంది ప్రజలను నేరుగా కలిసే బృహత్తర కార్యక్రమం 'మా నమ్మకం నువ్వే జగన్' చేపట్టనున్నట్లు గ్రామ సచివాలయ కన్వీనర్ల రాష్ట్ర కోఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు ప్రసంగించారు. జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతి, నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేమూరి గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం

మోపిదేవికాలనీ(మోపిదేవి): మోపిదేవికాలనీలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు కోరిన సమస్య తీర్చిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. రెండు రోజుల క్రితం మోపిదేవికాలనీలో గడపగడపకు తిరుగుతున్న సమయంలో సంక్షేమ పథకాలు వివరిస్తుండగా నూతనంగా చేపట్టిన జాతీయ రహదారికి కాలనీలోని అంతర్గత రోడ్ల అప్రోచ్‌రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలకు వెళ్లే రహదారిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సింహాద్రి సొంత నిధులతో రెండు లారీలు సన్నటి రబ్బీష్ వేయించి రహదారి సమస్య పరిష్కరించారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, పీఏసీఎస్ చైర్ పర్సన్ రావి రామప్రసాద్, మాజీ చైర్ పర్సన్ కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, గ్రామ పార్టీ కన్వీనర్ కారుమూరి తాతయ్య, కేసగాని రాంబాబు, దిలీప్ స్థానికులు ఎమ్మెల్యే సింహాద్రికి కృతజ్ఞతలు తెలిపారు.



మోపిదేవి కాలనీలో అప్రోచ్‌రోడ్డుకు వేసిన రబ్బీష్ పరిశీలిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

జాతర విజయవంతం చేద్దాం



కో–ఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

పెదప్రోలు(మోపిదేవి): గ్రామస్తుల సహకారంతో జాతర విజయవంతం చేయాలని చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅద్దంకి నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవం మార్చి 7వ తేదీ నిర్వహించనున్నారు. అందులో భాగంగా పలుశాఖల అధికారులు, గ్రామస్తులతో ఆలయ ధర్మకర్త కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య అధ్యక్షతన కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు పలు సూచనలు, సలహాలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్ ఆది రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుర్రా గురుప్రసాద్, మద్దిపట్ల జగన్‌మోహన్‌రావుతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి జాతర



ప్రత్యేక అలంకారంలో మహంకాళి అమ్మవారు

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం శివారు హరిపురం గ్రామంలో మహంకాళి అమ్మవారి ప్రధాన గుడిజాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక చేశారు. పండితుల మంత్రవచనాల నడుమ అమ్మవారికి వివిధ రకాల జలాలతో అభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. డప్పువాయిద్యాలు నడుమ గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై చిన్న అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు నీటిని ఓరబోసి తమ భక్తి భావం చాటుకున్నారు. వివిధ రకాల పుష్పాలు, అభరణాలతో అమ్మవారికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. రాత్రికి అమ్మవారి రంగవల్లిని తీర్చిదిద్ది, అన్నంరాశిని సమర్పించారు. గ్రామ యువకులు వీరతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మార్పీస్ నాయకుల పాదయాత్ర ప్రారంభం



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మార్పీస్ నాయకులు, కార్యకర్తలు

మచిలీపట్నంటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై చూపుతున్న నిర్లక్ష్యం వైఖరి నిరసిస్తూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆ సంఘ నాయకులు ఆదివారం పాదయాత్ర ప్రారంభించారు. ఆ సంఘ కృష్ణాజిల్లా కన్వీనర్ కొల్లూరి బసవ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక 31వ డివిజన్ శారదానగర్‌లోని భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఈ ర్యాలీని ప్రారంభించారు. బసవ మాదిగ మాట్లాడుతూ ఈ పాదయాత్ర కృష్ణా జిల్లా వ్యాప్తంగా మార్చి 15వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. పాదయాత్రలో మహాజన్ సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయకర్త మంద వెంకటేశ్వరరావు మాదిగ, ఎమ్మార్పీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరేలి ఎలీషా మాదిగ, మాదిగ విద్యార్థుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు దేవులూరి టోనీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

దీవించమ్మా.. గంగానమ్మ



అమ్మవారికి అభిషేకం చేస్తున్న ధర్మకర్త యుగంధరరావు, పండితులు

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి 11వ పునఃప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని మూలమూర్తికి అభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆదివారం ఉదయం డప్పువాయిద్యాల నడుమ చిన్న అమ్మవారిని బయటకు తెచ్చి విశేష పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావుతో పాటు మరో 15మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి అభిషేకాలను నిర్వహించారు. యద్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, కోడూరు, తూర్పువైపు గ్రామాలకు చెందిన మహిళలు ఇంటి వద్ద నుంచే బిందెలతో నీటిని తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. ముందుగా ధర్మకర్త దంపతులు పంచామృతాలతో గంగానమ్మ అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు చేసి చల్లగా దీవించాలంటూ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులే స్వయంగా అమ్మవారికి వేలాది బిందెల నీటితో అభిషేకం చేసి భక్తిప్రపత్తులు చాటారు. పండితులు కొమ్మూరి శ్రీనివాసశర్మ యాజ్ఞిక బ్రహ్మగా వ్యవహరించి కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, మహాచండియాగానికి సంకల్పం, మంటపారాధనను నిర్వహించారు. సోమవారం మహా ఛండీయాగం, పూర్ణాహుతి, మహా అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు యుగంధరరావు తెలిపారు.

205 మందికి కళ్లజోళ్ల పంపిణీ

గుడివాడటౌన్(నందివాడ): కుదరవల్లి గ్రామంలో ఆదివారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అమెరికాకు చెందిన హోప్ ఫర్ హ్యూమనిటి ఐఎన్‌సీ, మేరీల్యాండ్(యూఎస్‌ఏ) ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. ఈనెల 13న ఏపీ ఆప్టికల్స్ విజయవాడ వారు నిర్వహించిన కంటి పరీక్ష శిబిరంలో సుమారు 290 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో 205 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హోప్ ఫర్ హ్యూమనిటీ ప్రెసిడెంట్ వి.కోటేశ్వరరావు, ఫౌండర్ బి.కృష్ణారావు, గ్రామ సర్పంచ్ వసంతల సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు వసంతల కృష్ణ పాల్గొన్నారు.

ఆలయానికి కొత్త కళ



ప్రారంభానికి సిద్ధమైన వేంకటేశ్వర స్వామి ఆలయం

- రూ. 2 కోట్లతో గొడుగుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి
- నేటి నుంచి పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు

మచిలీపట్నంటౌన్: భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న గొడుగుపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కొత్త కళ వచ్చింది. పురాతన ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి మండపం కూలేందుకు సిద్ధంగా ఉండటంతో కొత్త ఆలయం నిర్మించాలని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి భక్తులు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే పేర్ని నాని సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లటంతోరూ. 1.80 కోట్ల మేర నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేశారు. మరో రూ. 20 లక్షలను భక్తులు, దాతలు సమకూర్చారు. మొత్తం రూ. 2 కోట్లకు పైగా వ్యయంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. 2020 డిసెంబర్ 22వ తేదీన ఆలయాన్ని పూర్తిగా తొలగించి, 24వ తేదీన భూమి పూజ చేశారు. అప్పటి నుంచి ఆలయ పునఃనిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తూ వచ్చారు. ఆలయ గర్భగుడి, మండపం, గాలిగోపురం తదితర నిర్మాణ పనులను పూర్తి చేశారు.

ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం..

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం ఈ నెల 27వ తేదీ సోమవారం నుంచి మార్చి 1వ తేదీ బుధవారం వరకు నిర్వహించనున్నారు. ఘనాపాటి విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ ఉదయం 7.38 గంటలకు మృగశిర నక్షత్ర యుక్త మీనలగ్నం లో ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు భక్తబృందం ఏర్పాటు చేసింది. 27వ తేదీ సోమవారం ఉదయం 9గంటలకు విష్వక్సేనపూజ, పుణ్యాహవచన, అకల్మష హోమం, విశ్వశాంతి కోసం నవగ్రహ యజ్ఞం, రాత్రి 6.20 గంటలకు ప్రార్థనాసూక్తం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచన, అఖండ దీపారాధన, దీక్షా స్వీకరణ, అంకురారోపణ, వాస్తుపూజ, వాస్తుహోమం, పంచవింశతి, కుంభాసాదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 28వ తేదీ మంగళవారం ఉదయం 7.20 గంటలకు విష్వక్సేనపూజతో పాటు పలు రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు శ్రీమాన్ ముక్తేవి వెంకట సత్యనారాయణాచార్యులు, ఆలయ అర్చకులు చక్రవర్తి ఆచార్యులు, వెంకట పార్థసారథి, కృష్ణమాచార్యులు, లీలా లక్ష్మీపతిఆచార్యులు నిర్వహించనున్నారు.

ఆలయాలకు మహర్దశ..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పలు హిందూ ఆలయాలకు మహర్దశ వచ్చింది. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను బాగు చేస్తున్నారు. మచిలీపట్నంలోని పలు ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో నిధులు మంజూరు చేయిస్తున్నారు.

– గోపిశెట్టి సతీష్, 39వ డివిజన్ కార్పొరేటర్

వైద్యశాల సందర్శన



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలను శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోగుల వార్డులను సందర్శించి వారితో వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి వైద్యసేవలు, మందుల వివరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు వచ్చే రోగులకు మరిన్ని వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. అత్యవసరం అయితే మినహా స్థానిక వైద్యశాలలోనే వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మినుము కోతలు



కృత్తివెన్ను మండలం గాంధీనగరం వద్ద మినుము కోత కోస్తున్న మహిళలు



గూడూరులో కాయ తీతపనిలో నిమగ్నమైన వ్యవసాయ కూలీలు

కృత్తివెన్ను: తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో రెండో పంటకు విరామం ఇవ్వడంతో అనుకూలమైన ప్రాంతాల్లో రైతులు అపరాల సాగు చేపట్టారు. మండల పరిధిలోని చెరుకుమిల్లి, యండపల్లి, చినపాండ్రాక, మునిపెడ, నీలిపూడి, సీతనపల్లి గ్రామాలలో దాదాపు 1,400 ఎకరాలలో నందిని, పీయూ31 రకాల మినుమును సాగు చేస్తున్నట్లు పలువురు రైతులు తెలిపారు. కొన్ని చోట్ల వైరస్ తెగుళ్లు సోకి పంట దిగుబడిపై ప్రభావం చూపినట్లు వివరించారు. కొన్ని గ్రామాలలో మాత్రం ఈ ఏడాది మినుము పంట ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుందన్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాలలో మినుము కోతలు ముమ్మరంగా సాగుతుండగా మరికొన్ని గ్రామాలలో పంట కాయ దశలో ఉన్నట్లు అధికారులు వివరించారు.

కాయతీత పనులు..

గూడూరు: మండలంలో మినుము పంట కాయ తీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రబీలో దాల్వ పంట లేకపోవడంతో అత్యధిక శాతం రైతులు అపరాల సాగు వైపు మొగ్గు చూపారు. మండలంలో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా మల్లవోలు గరువు, రాయవరం ప్రాంతాలలో కొంతమేర వేరుశనగ సాగు రైతులు చేపట్టారు. మిగిలిన గ్రామాల్లో మినుము సాగు అవుతోంది. పంట తయారవడంతో రైతులు మినుము కాయతీత పనులపై దష్టి సారించారు. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. ఎండలు కూడా బాగా కాస్తుండటంతో ఉదయం పూట మాత్రమే కూలీలు కాయ లాగటానికి వస్తున్నారు. మధ్యాహ్నం వరకూ చేస్తున్నారు.

సాగరతీరంలో మెరైన్ గస్తీ



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ సిబ్బంది

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. వీరంతా సముద్ర అలలు మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు. పర్యాటకులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. యాత్రికులకు సూచనలిస్తూ, సముద్ర స్థితిగతుల గురించి వివరించారు. సాగరసంగమం వద్ద పరిస్థితులు భిన్నంగా ఉండడంతో పర్యాటకులను అక్కడకు అనుమతించలేదు. సీఐ పవన్‌కిశోర్, ఎస్‌ఐ జిలానీ పర్యవేక్షణలో గస్తీ చేపట్టారు.